

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

శనివారం 27 జూలై 2024 8 పేజీలు


# వీధి కుక్కల నియంత్రణకు చర్యలేవి...!



- వెంటాడి కరుస్తున్న వైనం...
- ఎనిమిది నెలల్లోవందల కేసులు నమోదు..
- కుక్కల సంతతి నివారణ పై పట్టింపు కరువు..!

సూర్య గంభీరావుపేట

పల్లెలు పట్టణాలు అని తేడా లేకుండా వీధి కుక్కల సమస్య రోజురోజుకు బెంబేలెత్తిస్తోంది.రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కల బెడదతో జనం హడలెత్తిపోతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో కుక్కలు జనాలపై వెంటాడి కరుస్తున్నాయి. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో చాలా రోజుల నుండీ కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రధాన రహదారులు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ రోడ్ల పక్కన నడుచుకుంటూ వెళుతున్న వారిపై దాడులు చేస్తున్నాయి. అలాగే ఇళ్ల ముందు ఆడుకుంటున్న పిల్లలు రాత్రివేళలో ఇళ్ల ముందు నడుచుకుంటూ వస్తున్న వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ద్విచక్ర వాహన దారులపై వెంటా డి వెంబడిస్తున్నాయి. ఎనిమిది నెలల్లో మండల పరిధిలో కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. కుక్కల బారిన పడుతున్న వారిలో వృద్దులు చిన్న పిల్లలు కూడా ఎక్కువగా ఉంటున్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ నగర్ కాలనీలో శుక్రవారం రోజున లింగన్నపేట గ్రామానికి చెందిన గడప లక్ష్మణ్(70) అనే వృద్ధుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే స్థానికులు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన ఉదాహరణ మాత్రమే.ఇలాంటి సంఘటనలు ప్రతిరోజు జరుగుతూనే ఉన్నా యి. నీరు ఆహారం వెతుక్కుంటూ గ్రామ సమీపంలో వస్తున్న జింకలు నెమళ్ల పై కుక్కలు, గుంపులుగా దాడి చేస్తుండంతో మృత్యువాత పడుతున్నాయి. గొర్రెలు మేకలు, పశువుల పై దాడి చేస్తున్నాయి. ప్రభుత్వం నుండీ కుక్కల నియంత్రణ చర్యలు కరువయ్యాయి కనీసం వాటి సంతతి నివారణకు చర్యలు కూడా చేపట్టడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. (మిగతా 2లో)

# గంజాయి సేవించేవారు తస్మాత్ జాగ్రత్త

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

- పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి గంజాయి టెస్టింగ్ కిట్లు
- డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో తరచూ తనిఖీలు
- గంజాయి ఆరికట్టేందుకు రాజన్న సిరిసిల్ల పోలీసుల చర్యలు
- గంజాయి కిట్ల సహాయంతో 08 మందిపై కేసు నమోదు
- 390 గ్రాముల గంజాయి,05 గంజాయి సిగరెట్లు స్వాధీనం

సూర్య రాజన్న సిరిసిల్ల.

గంజాయి సేవించేవారు ఇక తస్మాత్ జాగ్రత్త. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ కోవలోనేజిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకి గంజాయి టెస్ట్ కిట్లను అందుబాటులోకి తెచ్చారు. వీటి ద్వారా గంజాయి సేవించిన వారిని పట్టుకుని కటకటాల్లోకి పంపమన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ గంజాయి టెస్టింగ్ కిట్లను ఆవిష్కరించి అన్ని పోలీస్ స్టేషన్లో అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లలో రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ (మిగతా 2లో)



# మహిళల ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు బాగుంటుంది

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

- మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- శుక్రవారం సభను సద్వినియోగం చేసుకోవాలి

సూర్య కరీంనగర్ ప్రతినిధి / రామడుగు (వివరాలు 2లో)



# చినుకు పడితే చిత్తడే..

## ప్రకాశం రోడ్ టు అయిలాపూర్ రోడ్ దుస్థితి

సూర్య కోరుట్ల టౌన్

చినుకు పడిందే తడవు చిత్తడిగా మారి చుక్కలు చూపిస్తున్నాయి. పట్టణంలో పలు వార్డుల్లో సి.సి. రహదారుల నిర్మాణం నాసిరకంగా ఉన్న క్రమంలో వానాకాలంతో వాటి అసలు రంగు బయటపడుతోంది. పడిన వర్షపు నీరంతా రహదారిపై నిలిచిపోయి ప్రయాణికులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. మరికొన్న చోట్ల మట్టిరోడ్ల కంటే అధ్వానంగా మారి అడుగు తీసి అడుగు వేయలేని చందంగా మారాయి. దీంతో వాహనదారులు ఈ మార్గాల్లో ప్రయాణించాలంటే జంకుతున్నారు. వానాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మరో మూన్నెళ్ల సంగతి ఏమిటని కాలనీ వాసులు వాపోతున్నారు. కటుకం సంగయ్య ఫంక్షన్ హాల్ నుండి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకు వేసిన సి.సి. రహదారి అధ్వానమైన రహదారులకు నిదర్శనంగా నిలుస్తున్నది. పలు చోట్ల ఈ రహదారి వర్షపు నీరు నిలిచి చెరువులా మారగా, మరికొన్ని చోట్ల మట్టిరోడ్డు బురద మయంగా మారింది. అడుగులోతు బురద పేరుకుపోయి అధ్వానంగా ఉంది. దీంతో వందలాది కుటుంబాలు నివసిస్తున్న ఈ వీధి నివాసితులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. బల్దియా అధికారులు, పాలకవర్గం అంతర్గత రహదారులపై దృష్టి సారించి వానాకాలంలో ఈ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ ను కాంగ్రెస్ విస్మరించింది

## - గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

## - బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్ట రాజు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో భాగంగా చేవెళ్ల వేదిక గా ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ ను ప్రకటించిం దని , నేడు అధికారంలోకి వచ్చాక డిక్లరేషన్ ను విస్మరించడం సమంజసం కాదని, వెంటనే డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కట్ట రాజు డిమాండ్ చేశారు. బిజెపి ఎస్టీ మోర్చా ఇచ్చిన పిలుపుమేరకుఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ను వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం కరీంనగర్లోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టి జిల్లా కలెక్ట ర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తేదీ 26 ఆగస్టు 2023 నాడు చేవెళ్ల బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ డిక్లరేషన్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ మూడు నెలల వ్యవధి లోనే అమలు చేస్తామని చెప్పిన ఎనుముల రేవంత్ రెడ్డి ఆవిషయాన్ని మరిచిపోయా రన్నా రు.ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడు స్తున్న ఎస్టీల కోసం డిక్లరేషన్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని భారతీయ జనతా పార్టీ జిల్లా ఎస్టీ మోర్చా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాము.ఎస్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ,. లేనియెడల భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా ఆధ్వ ర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందో ళన కార్యక్రమాలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరిం చారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి ఎస్టీ మోర్చ జిల్లా సెక్రెటరీ మోగిలి శ్రీనివాస్, మానకొండూరు ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సార్ల అనిల్, కేశపట్నం ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బిజిలి సారయ్య,ప్రధాన కార్యదర్శి లోకిన కుమా స్వామి, కొత్తపల్లి మండల అధ్యక్షుడు రాబోతు శ్రీనివాస్ నాయక్, నాయకులు రవి నాయక్, అజయ్, అభి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సైద్ధాంతికంగా,రాజకీయ అవగాహన పెంచుకొని కమ్యూనిస్టు శ్రేణులు ముందుకు సాగాలి

## -సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా లోని గ్రామ శాఖ కార్యదర్శిల, జిల్లా కౌన్సిల్ సభ్యులకు రెండు రోజుల పాటు గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో గల ఎల్ఐసి ఏజెంట్ల సంఘం భవన్ లో జరిగిన రాజకీయ శిక్షణ తరగతులు నేటితో ముగిశాయని, శిక్షణ తరగతుకు హాజరైన నాయకులు, కార్యకర్తలు సైద్ధాంతికంగా,రాజకీయంగా అవగాహన పెంపొందించుకొని ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపు నిచ్చారు.రెండవ రోజున శిక్షణ శిబిరం లో మతం,మతోన్మాదం, ప్రమాదం లో భారత రాజ్యాంగం అనే అంశంపై ఉమామహేశ్వర్ బోధించారని, పార్టీ కార్యక్రమం అనే అంశాన్ని సింగు నర్సింహా రావు బోధించారని తెలిపారు .ఈ శిక్షణ తరగతుల్లో సిపిఐ సిద్దిపేట రాజన్న సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల జిల్లా కార్యదర్శిలు మంద పవన్, గుంటి వేణు,తాండ్ర సదానందం, వెన్న సురేష్ లతో పాటు ఐదు జిల్లాల కార్యవర్గ సభ్యులు,కౌన్సిల్ సభ్యులు,శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బడ్జెట్పై దళిత సంఘాల నాయకులు వర్షం

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో గల అంబేద్కర్ విగ్రహానికి జిల్లా అధికార ప్రతినిధి ఎలుకపల్లి సంపత్ , మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రెడ్డి గాని రాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో దళితులకు 33 వేల కోట్ల బడ్జెట్ ను కేటాయించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అలాగే దళితులకు మరింత న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు బట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, మానకొండూర్ శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ లకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎన్నికల సమయం లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నిరుపేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జిల్లా అధికార ప్రతినిధి ఎలకపల్లి సంపత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రెడ్డిగాని రాజు, జిల్లా పార్టీ కార్యాలయం ఇంచార్జ్ గోపు మల్లారెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మాతంగి సతీష్, జిల్లా నాయకులు జంపన్న, కోహెడ నాగరాజ్, రెడ్డిగాని మొగిలి, ఖాత కొంరయ్య,కుంబాల లింగయ్య, రెడ్డిగాని స్వామి, బోనగిరి రాజయ్య తదితరులు ఉన్నారు.

# ఎన్సిసి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్

**సూర్య కరీంనగర్ టౌన్**



జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్సిసి ఆధ్వర్యంలో శు క్రవారం కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ఎన్సిసి కెప్టెన్ కిరణ్ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్, మాట్లాడుతూ సరిగ్గా 25 సంవత్సరాల క్రితం 1999లో ఇదే రోజు కాశ్మీర్ లోని, కార్గిల్ జిల్లా భారత సరిహద్దు ప్రాంతంలో దాదాపు 3 నెలల పాటు జరిగిన భీకర పోరులో భారత సైనికులు దాదాపు 490 మంది వీరమరణం పొంది, పాకిస్తాన్ పై విజయ దుందుభిని మోగించిన ఈరోజును కార్గిల్ విజయ్ దివాస్ గా జరుపుకుంటూ, అమరులైన జవాన్లకు నివాళులు అర్పిస్తూ వారి ధైర్యసాహ సాలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 9వ తెలంగాణ ఎన్సిసి బెటాలియన్ హవల్దార్ అమూల్ షిండే ఎన్సీసీ కెడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు. ఎన్సిసి కెడెట్స్ కు కార్గిల్ యుద్ధం జరిగిన తీరును వివరిస్తూ, దేశ భద్రత,రక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్, ఎ.సి.ఓ.బి.సంపత్ కుమార్,ఎన్సిసి అధికారిణి కెప్టెన్ కిరణ్ జ్యోతి , డాక్టర్.గోపికృష్ణ ,డాక్టర్.అలీ ఖాన్ , ఎ.ఓ.బి.శ్రవణ్ కుమార్,ఎన్సిసి కెడెట్లు విద్యార్థినీ,విద్యార్థులు,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీలకు పెద్దపీట

## డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

**సూర్య మానకొండూర్**



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో సంక్షే మానికి ప్రాధాన్యం ఇచ్చిందని ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక నిధుల కింద రూ.50,180 కోట్లు కేటా యించింది ఇందులో ఎస్సీల ప్రత్యేక నిధికి రూ.33,124 కోట్లు ఇచ్చినందుకు గాను మానకొండూర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనకం అశోక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ఎస్సీలను కేవలం ఓటు బ్యాంక్ గానే చూసిందని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీలకి పెద్దపీట వేస్తూ వారి సంక్షేమానికి 33,124 కోట్లు వెచ్చించినందుకు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణకు దళిత సంఘాల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గసికంటి సంపత్,నాయకులు కొండ్ర సురేష్, చలిగంటి ఓదేలు,ఆంజనేయులు,బండెల మహేందర్, మాశం రామకృష్ణ ,రామగిరి సంతోష్,కనకం రాకేష్ తదితరులు పాల్గొన్నారు..

# పిన్నింటి శ్రీనాథ్ జ్ఞాపకార్థం మిత్రుల సేవా కార్యక్రమాలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



సామాజిక కార్యకర్త, హిందూ వాది తోట బబ్లు హిందూ (పిన్నింటి శ్రీనాథ్ ) జ్ఞాపకార్థం కరీంనగర్ లోని తొమ్మిదో డివిజన్లో ఆయన మిత్రులు శుక్రవారం రోజున పలు సేవా కార్యక్రమాలు చేప ట్టారు. శుక్రవారం శ్రీనాథ్ పుట్టినరోజును పురస్కరించుకొని తొమ్మిదో డివిజన్లో గల పలు అంగన్వాడి కేంద్రాల్లో కేక్ కోసి పిల్లలకు పండ్లు బిస్కె ట్లు పంపిణీ చేశారు. అలాగే హౌసింగ్ బోర్డులో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సంద ర్భంగా శ్రీనాథ్ మిత్రులు మాట్లాడుతూ ప్రేమతో పిలుచుకునే తోట బబ్లు హిందూ తమ మధ్య లేకపోవడం బాధాకరంగా ఉందన్నారు. మిత్రుడు శ్రీనాథ్ ను ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అలాంటి మిత్రుడు తమ మధ్యలో లేకపోయినా జ్ఞాపకార్థంగా శ్రీనాథ్ జన్మదినోత్సవాన్ని పురస్క రించుకొని పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.

# హైవే రోడ్డుపై నాటు వేసి బిజెపి నిరసన

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి పట్టణంలో ప్రధాన సమ స్యగా మారిన రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా, రోడ్డు ఇరువైపులా బుర ద మయం కాగా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వరి నాటు వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగామాట్లాడుతూ బీజేపీ పార్టీ పక్షాన మహా ధర్నా నిర్వహిస్తే కమిషనర్ కాంట్రాక్టర్ తో తు తు మంత్రంగా మోరం పోసి వదిలేశారే తప్ప సమస్యకు పరిష్కారం చూప లేదని అన్నారు.ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులు గుర్తించి రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ లేని యెడల రానున్న రోజుల్లో మున్సి పాలిటీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి చేపూరి సత్యనారాయణ,పట్టణ ప్రధానకార్యదర్శి చిల్ల శ్రావణ్, గుం డేటి శివశంకర్ , మంద శ్రీరామ్, జీట్ల కుమార్,మోర్చ అధ్యక్షులు అను కరి సాయి కృష్ణ, వడ్లూరి సుధకర్, చల్ల అనుష్,సిరిపురం గంగారాం, అనుమాండ్ల రాజశేఖర్, విలిగేటి వికాస్, అనుమల్ల కొటేష్,రాజు, స్వర్గం కళ్యాణ్ , పవన్, గంగు సంపత్, దండే మహేశ్, బోడిగే శ్రావణ్,తదితరులు పాల్గొన్నారు.

# తన స్వంత ఖర్చుతో చెట్లను తొలగించిన యువ నాయకుడు

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం నర్సింగాపూర్ – లస్మక్కపల్లి గ్రామాల మధ్య గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాలుగు రోజుల క్రితం తుమ్మ చెట్లు విరిగి రోడ్డు పై పడి పోవడంతో వాటిని ఎవరు తొలగించక పోవడంతో.... నేనున్నానంటూ లస్మక్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ చెందిన యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్ తన స్వంత ఖర్చుతో జేసిబి యంత్రం ద్వారా చెట్లను తొలగించి శుభ్రం చేయించాడు. ఆ గ్రామంలో పేదలు ఎవరైన మృతి చెందితే తన వంతుగా ఆర్థిక సహాయం అందిస్తూ ఇటు నాయకునిగా, సమాజ సేవకుని గా గ్రామ ప్రజల మన్ననలను పొందుతున్నాడు.

# జైలర్ దేవేందర్కు సన్మానం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ సబ్ జైల్ నూతన జైలర్ నాంపల్లి దేవేందర్ ను జీకే రైతు మిత్ర మండలి వ్యవస్థా పకులు గూడూరు స్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జైలర్ దేవేందర్ కు పూల మొక్క ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఖైదీలను ప్రేమ, దయతో చూసి, వారు సాధారణ పౌరులుగా మారే విధంగా, వారి అభిమానం పొందేటట్లు సబ్ జైలు అధికారులు తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చందుపట్ల జనార్దన్, కంకణాల జనార్దన్ రెడ్డి, డి. అనురాధ, బొంగోని వెంకటయ్య, మండల వీరస్వామి, కోటోజు జ్యోతి రాణి, సంపత్ రెడ్డి, డి. సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన చిలువేరి కమలవ్వ ఇటీవల అనా రోగ్యంతో మరణించగా శుక్ర వారం రోజున బాధిత కుటుం బాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపిన స్థానిక కాంగ్రె స్ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రామ్ తన వంతు సాయంగా బియ్యం సాయం ను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమం లో పోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

# జగిత్యాల

శనివారం 27 జూలై 2024 4


## మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధి లక్ష్యముగా మహిళా శక్తి పథకము

### -మున్సిపల్ కమిషనర్ బి.తిరుపతి

సూర్య -కోరుట్ల



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తామని మున్సిపల్ కమిషనర్ బి తిరుపతి అన్నారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరం మెప్మా అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ తో కలిసిమెప్మా రిసోర్స్ పర్సన్స్, మహిళా సంఘ సభ్యులతో మహిళా శక్తి కార్యక్రమముపై అవగాహన కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తామని అన్నారు. మహిళా క్యాంటీన్లతోపాటు స్త్రీనిధి లింకేజ్, బ్యాంకులింకేజ్ ల ద్వారా నిధులు సమకూర్చి మహిళలు ఆర్థకంగా ఎదిగేందుకు రుణసదుపాయం కల్పిస్తామన్నారు. రాబోయే సం,,లో 2.89 కోట్ల రుణ సదుపాయము కోరుట్ల మున్సిపాలిటీకి కల్పించాలని, ఇట్టివి వ్యాపారాభివృద్ధి కోసం వినియోగించుకోవాలని, మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయాలని, సంఘాలలో లేని మహిళలను సంఘాలలో చేర్పించలని, వడ్డీ లేని రుణాలపై అవగాహన కల్పించాలని, ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి 2 లక్షల భీమా సౌకర్యం (స్త్రీనిధి), ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి ప్రమాదవశాత్తు భీమా 10 లక్షలు, వ్యాపారమునకు సంబంధించి నైపుణ్యాలను, మార్కెటింగ్, బ్రాండింగ్ డెవలప్ చేయుట, అమ్మ ఆదర్శ స్కూల్ లలో వి.ఓ ప్రెసిడెంట్ ద్వారా స్కూల్ బిల్డింగ్ రిపేర్లు చేయించడం, మౌళిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేయించడం, స్కూల్ యూనిఫామ్స్, అంగన్వాడి పిల్లల యూనిఫామ్స్ ,ఇతర ప్రైవేట్ కంపెనీల ఉద్యోగుల యూనిఫామ్స్ , ప్రభుత్వ ఉద్యోగుల యూనిఫామ్స్ ను స్వయం సహాయక సంఘ మహిళల ద్వారా కుట్టించడం, డ్వాక్రా బజార్లు ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, మీసేవా సెంటర్లు (బ్యాంకింగ్ జనరల్ లావాదేవీలు,SHG ల ఆర్థిక లావాదేవీలు), జిల్లా కు ఒక క్యాంటీన్ (ప్రభుత్వ ఆసుపత్రి ) మహిళలచే నిర్వహించేల చేయడం, ఫుడ్ సెక్టార్/ నాన్ ఫాం సెక్టార్ లో మహిళలను మహిళా శక్తి పరిధిలోకి తీసుకురావాలని, సర్వీస్ సెక్టార్ లలో బ్యాంకు మిత్ర, పశుమిత్ర, కృషి మిత్ర లను గుర్తించి శిక్షణ ఇచ్చి సంబంధిత రంగాలను నిర్వహించేలా చేయడం వంటివి చేపట్టాలని తెలిపారు.ఇట్టి కార్యక్రమములో డి.యం.సి సునీత, టి.యం.సి శ్రీరామ గౌడ్,Coమెప్మా ,రిసోర్స్ పర్సన్స్ , ALF & TLF అధ్యక్షులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### -మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

సూర్య జగిత్యాల



వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవా లని మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం 3 డ దే కార్యక్రమంలో భాగంగా 3వా ర్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని, అలాగే ఖాళీ స్థలా ల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచిం చారు. కాలువలకు అడ్డంగా రాళ్లను పెట్టడం వల్ల నీరు నిల్వ వుంటుందని, వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ అధికారులకు రోడ్లు, కాలువలను రోజూ శుభ్రం చేయాలని, ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలిం చాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు చర్యలు

### - పరిసరాల పరిశుభ్రత పాటించాలి డింఎంహెచ్వొ సమియోద్దిన్

సూర్య మల్లాపూర్



ప్రజలు సీజనల్ వ్యాధులు డెంగ్యూ జ్వరాల బారిన పడ కుండా అప్రమత్తంగా ఉండా లని డెంగ్యూ నివారణకు చర్యలు చేపడుతున్నామని డిఎంహెచ్వొ డా.సమియోద్దిన్ అన్నారు.ఈ మేరకు మండలం లో డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు ముత్యంపేట్ గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన ఇంటితో పాటు పరిసరాలలో పైరేత్రం స్ప్రే చేసి నీరు నిల్వవున్న గుంతల్లో ఆయిల్ బాల్స్, టీమోఫాస్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ దోమలు నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయి కాబట్టి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని నీటిని నిల్వ చేసే తొట్లు, డ్రమ్ములకు మూతలు ఉంచాలని వారానికి ఒకసారి కడిగి ఆరబెట్టి నీటిని నింపుకోవాలని వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చికిత్స కంటే నివారణ ముఖ్యమని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ వొ ఆకుల శ్రీనివాస్, మండల వైద్యాధికారి వాహిని రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అమర జవాన్లకు అంజలి ఘటించిన ప్రగతి విద్యార్థులు

సూర్య రాయికల్



రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా అమరు లైన సైనికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి,నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత విజయం సాధించి,నేటికీ 25 సంవత్సరాలు అవుతుందని,దేశ ప్రజల కోసం ప్రాణాలర్పించిన వీరులను మనము స్మరించాలని,ప్రతి విద్యార్థి దేశభక్తిని కలిగి ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ట్రాక్టర్లు మాయం

### -అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన 35వవార్డు కౌన్సిలర్

సూర్య జగిత్యాల



జగిత్యాల మున్సిపాలిటీకి సంబంధించిన రెండు ట్రాక్టర్లు మాయమయ్యాయని, వాటి పై విచారణ జరిపించాలని 35 వ వార్డు హనుమాండ్ల జయశ్రీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతం రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఏపి 15 ఎక్స్ 7477, ఏ పి 15 ఎక్స్ 7474 నెంబర్లు గల ట్రాక్టర్ల పేరిట రిపేర్ల ఖర్చు కౌన్సిల్ ఆమోదం పొందిందన్నారు. అయితే ఈ ట్రాక్టర్లు గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఒక్కరోజు సానిటేషన్ పని కొరకు రోడ్డు మీద తిరుగ లేదు. కాని, ఈ రెండు ట్రాక్టర్లు నడుపుతున్నట్టు రికార్డుల్లో నమోదయ్యిందన్నారు. కేవలం ఈ రెండు ట్రాక్టర్లు మాత్రమే ఈ రకంగా మాయం అయినాయ? లేదా ఇంకా ఆటోలు కూడ ఈ లిస్టులో ఉన్నాయా? అనే విషయం తెలియాలంటే పూర్తి స్థాయి విచారణ చేయాలని ఫిర్యాదులో కోరారు.

## కేడిసిసి బ్యాంకు జిల్లా డైరెక్టర్‌గా మందాటి సాగర్

సూర్య బీర్పూర్



కరీంనగర్ కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్‌గా బీర్పూర్ మండలం మంగేల గ్రామానికి చెందిన మందాటి సాగర్ శుక్రవారం ఎన్నిక య్యారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నన్ను జిల్లా డైరెక్టర్ గా ఎంపిక చేసిన రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావుకి, ముప్పాల రాంచందర్ రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కార్గిల్ అమర వీరులకు బిజెపి నాయకులు కొవ్వొత్తుల నివాళి

సూర్య రాయికల్



భారతీయ జనతా పార్టీ రాయికల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ అమర వీరులకు స్థానిక భరతమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను కొనియా డుతూ దేశం సుభిక్షంగా శాంతితో సంతోషంగా ప్రజలు జీవిస్తున్నారు అంటే,మన భారత సైనికుల యొక్క త్యాగాలే అని ఆయన అన్నారు. చుట్టూ తీవ్రవాద దేశాలు,దేశంలో అర్బన్ నక్సలిజం విద్రోహ శక్తులు అనునిత్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతుంటే,నేడు దేశ సైనికులు వాటిని తిప్పికొడు తూ దేశం కోసం ప్రాణాలర్పిస్తూ, వారు చేస్తున్నటువంటి సేవను వెలకట లేనిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్య వర్గ సభ్యులు కురుమ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మహేష్,పట్టణ ఉపాధ్యక్షులు కడార్ల శ్రీనివాస్,మోసారపు శ్రీకాంత్, దళిత మోర్చా అధ్య క్షులు బన్న సంజీవ్,మండల బీసీ సెల్ అధ్యక్షులు గుగ్గిళ్ళ రాము,కార్యదర్శి సామల్ల సతీష్,నాయకులు శంకరయ్య,రవి,గోపి, శంకర్,నరేష్,ఎల్లా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి హై స్కూల్‌లో కార్గిల్ విజయ్ దివస్

సూర్య జగిత్యాల



జగిత్యాల పట్టణం లోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో శుక్ర వారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుడు , పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు కార్గిల్ యుద్ధం గురించి, సైనికుల గొప్పతనం వారు చేసిన త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999, మే 3న కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్, పాకిస్తాన్ మధ్య కార్గిల్ యుద్ధం ప్రారంభమయింది. దీనిని భారత సైన్యం ఆపరేషన్ విజయ్ అనే కోడ్ నేమ్ ను పెట్టుకుంది. అంతటి చలిలో, మంచు పర్వతాల్లో దాదాపు 60 రోజులపాటు జరిగిన యుద్ధంలో ఇరుదేశాల సైనికులు చాలామంది చనిపోయారు. 527 మంది భారత సైనికులు అమరులు య్యారు.చివరికి జూలై 26న భారత భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి, భారతదేశ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా భారత్ విజయం సాధించింది. అందువల్ల ప్రతిఏటా జూలై 26 కార్గిల్ విజయ దినోత్సవం జరుపబడుతుందని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత దేశభక్తిని పెంపొందించే సైనికుల గొప్ప తనాన్ని వివరించే నినాదాలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు , శ్రీధర్ రావు ,మౌనికారావు, అజిత ఉపాధ్యాయ బృందం,స్కౌట్స్ అండ్ గైడ్స్‌విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో గుండెపోటుతో వలస కార్మికుడు మృతి

సూర్య మేడిపల్లి



మండలంలోని కట్ల కుంట గ్రామానికి చెందిన నూతిపెల్లి లక్ష్మణ్55 దుబాయ్ లో గుండెపోటుతో మృతి చెందినట్లు శుక్రవారం రోజు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు తెలి పారు.లక్ష్మణ్ కు భార్య అఖిల,కూతురు జయ,కుమారులు అశ్విత్ తేజ,రియాన్ లు ఉన్నారు.లక్ష్మణ్ ది నిరుపేద కుటుంబం.బ్రతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి మృత్యువాత పడటంతో ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం శోక సముద్రంలో మునిగి పోయింది.ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకొని అండగా ఉండాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# లక్ష లోపు రుణమాఫీ అర్హులు అందరికీ పూర్తి చేస్తాము

## -యూరియా సరిపడే నిల్వలు మండలంలో ఉన్నాయి -పలు ఎరువులు ,పురుగు మందులు దుకాణాలు తనిఖీ

## -జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆది రెడ్డి

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ మండల కేంద్రంలో ని రొంపి కుంట గ్రామపంచాయతీ లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆది రెడ్డి హాజరయ్యారు. రైతు రుణ మాఫీ కింద వచ్చిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని, భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రుణమాఫీ పథకానికే వినియోగించాలని, ఎట్టి పరిస్థితు ల్లోనూ ఇతర అప్పులకు జమ చేసుకోవద్దని ఆదేశించారు. ఈ నెలలోనే రెండో దఫా రూ. 1.50 లక్షల వరకు ఉన్న రుణాలకు, ఆ తర్వాత రూ. 2 లక్షల రుణాలకు నిధులు విడుదల చేస్తామని అన్నారు. ప్యాక్స్ల లో రైతులవారీగా వివరాలు తీసుకొని ఎవరికి ఎంత



మాఫీ అయిందో తెలుసుకున్నారు. ఎవరైనా రైతులకు రుణమాఫీ కాకపోతే, ఆయా రైతులు మండల వ్యవసాయాధికారులను కలిసి ఫిర్యాదు చేయాలని, ఆయా ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలియజేశారు. ఎవరైనా రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ జరగకపోతే, ఆయా రైతులు ఆందోళన చెందకుండా మీ పరిధిలోని రైతు వేదికలో ఏఈవోలను సంప్రదించి ఫిర్యాదు నమోదు చేయగలరు. రైతు రుణమాఫీ-2024 కు గాను ప్రతి మండలంలో రుణమాఫీ ఫిర్యాదుల విభాగాన్ని మండల వ్యవసాయ అధికారిని నోడల్ ఆఫీసర్గా ఈ నెల18వ తేదిన ఏర్పాటు చేయడం జరిగింది. రికార్డులో ఉన్న స్టాక్, గోదాములో ఉన్న సరుకులను సక్రమంగా ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు, విత్తన విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, విస్తరణ అధికారి అజ్మీరా సురేష్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మరియు ఫీల్డ్ ఆఫీసర్, కమాన్ పూర్ పిఎసిఎస్ సీఈఓ టి.సంతోష్ మరియు పిఎసిఎస్ కన్నాల సీఈఓ సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై ఎమ్మార్వోకు వినతి పత్రం

**సూర్య ముస్తాబాద్**



మండలములోని 22 గ్రామాలలో మురికి కాలువల నిర్వహణ,బ్లీచింగ్ దోమల నివారణ చర్యలు ఎక్కడ కూడా సక్రమంగా జరగడం లేదని ప్రతి రోజు వర్షాలు కురుస్తున్న ందున డెంగ్యూ విష జ్వరాలు, సీజనల్, వ్యాధులు ప్రబలకుండా చూడాలని బిఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు మెంగనీ మనోహర్ అధ్వర్యంలో ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమములో బిఅర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు శీలం స్వామి,విద్యార్థి మండల అధ్యక్షులు ఎండీ నవాజ్,కంచం నరసింహులు, పల్లె సత్యం,ఎండీ జహంగీర్, మిడిదొడ్డి యాదగిరి,శీలం వెంకటేష్,పుల్లూరు శ్రీనివాస్,ప్రశాంత్,గుణశేఖర్,కొనరావు పేట శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు ఇవ్వలేదనడం మూర?త్వం

**సూర్య- కాల్వ శ్రీరాంపూర్**

పార్లమెంట్లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చెయ్యి చూపించారంటూ కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు అర్థం˜హితం, ఈసారి బడ్జెట్లో తెలంగాణకు మేలు జరిగిం దని, శాఖల వారీగా కేటా యింపులతో వాస్తవాలు తెలు స్తాయని బిజెపి మండల అధ్య క్షులు చిలువేరు సంపత్ కుమార్ అన్నారు. దొంగ హామీలతో పబ్బం గడు పుకునే కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడాన్ని ఖండిసు ్తన్నా మని అన్నారు. ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మోడీ ఉన్నంతవరకు తెలంగాణకు అండగా బిజెపి ఉంటుందని, తెలంగాణలో రైల్వే రోడ్ల నిర్మాణానికి ఇతర అభివృద్ధి రంగా లకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందని, వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి, మోడీ రైతుల పట్ల వారికి ఉన్న చిత్త శుద్ధికి నిదర్శన మని తెలిపారు. బడ్జెట్లో మౌలిక రంగాల అభివృద్ధికి మరియు విద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యంత కేటాయించారు. కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు ముద్ర రుణాలకు పరిమితి పెంపు ఉన్నత విద్యకు రుణాల ఏర్పాటు తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత 437 అండర్ ప్రాజెక్టు వర్క్స్ మరియు మహిళలు బాలికలకు లబ్ధి చేకూర్చే పథకాలకు బడ్జెట్ కేటాయించారు నాలుగు కోట్ల మంది యువతకు ఉపాధి కల్పించే బడ్జెట్ ప్రతిపాదించడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చల్లా చంద్రమౌళి , తోటశ్రీధర్, పోగులశ్రీనివాస్, గరుడ కిషన్, సముద్రాల శ్రీనివాస్, రాములు, బొద్దు లక్ష్మణ్, దాసరి ఆకాష్, తతరాజు కోసవెం కటేష్, దాసరి కృష్ణ, తిరుపతి దిలీప్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## గంజాయి,మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

**సూర్య-పెద్దపల్లి టౌన్**



రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ ఐపిఎస్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం లో భాగంగా ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పెద్దపల్లి సిఐ ఆర్.కృష్ణ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి తదితర మాదగద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని, విద్యార్థులు గంజాయి మాదక ద్రవ్యాలకు, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కావద్దని, వాటికి ఆకర్షితులు అయి జీవితాలు నాశనం చేసుకోవొద్దని,అంతేకాకుండా విద్యార్థులు చదువు పై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని జీవితం లో ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. ఎటువంటి చెడు అలవాట్లు లేకుండా తమ తల్లీ తండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని తెలియచేసారు. ఎవరైనా గంజాయి అమ్మినా, పీల్చిన తమ దృష్టికి తేవాలని, గంజాయి మహమ్మారి నిర్మూలనలో అందరు తమ వంతుగా కృషిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై మల్లేష్ ,కళాశాల ప్రిన్సిపాల్ ,కళాశాల విద్యార్థులు, కళాశాల లెక్చరర్స్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి రెయిన్ కోర్ట్స్ పంపిణీ

**సూర్య సెంటినరీ కాలనీ**

కమాన్పూర్, సిద్దపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికుల కు, కారోబార్స్ కు , పంప్ డ్రైవర్స్ కు , ఎలక్ట్రీషియన్ తో పాటు సుంద రం ఫౌండేషన్ ఫౌండర్, లయన్స్ క్లబ్ మెంబర్ బోనాల వెంకటస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎండీ.ఆరిపోద్దీన్ రెయిన్ కోర్ట్స్ పంపిణీ చేశారు. సుమారు 23 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ ప్రసాద్ తో పాటు సుందరం ఫౌండేషన్ సభ్యులు, మాజీ వార్డ్ మెంబర్ జంగపల్లి లక్ష్మణ్, గెల్లు లింగయ్య, చెన్నోజు చంద్రశేఖర్, కన్నూరి నగేష్, చిప్పకుర్తి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



### బదిలీలు సహజం....

## పనితనంతో మంచి పేరు తెచ్చుకోవాలి

**-ఎంపీడీవో శైలజ రాణి**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజమని రామగిరి ఎంపీడీవో బి.శైలజ రాణి అన్నారు. రామగిరి మండలం నుంచి బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శు లును , కొత్తగా బదిలీపై వచ్చిన కార్యదర్శులను, బదిలీ పై వెళ్లిన ఆఫీస్ సబ్ ఆర్డినేట్ పోషమల్లు ను శుక్రవారం ఘనంగా సత్కరించడం జరిగింది. ఎక్కడికి వెళ్లిన మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రజలకు సేవా చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, సూపరిండెంట్ దేవరకొండ.ఉమేష్, ఈసీ రాసపల్లి. లక్ష్మణ్, సీనియర్ అస్సిటెంట్ ఎండీ.షరీఫ్ పాల్గొన్నారు.

### తెలంగాణ బడ్జెట్ ప్రజల బడ్జెట్ కాదు..

## కేవలం కాంగ్రెస్ నాయకుల బడ్జెట్

**సూర్య- పెద్దపల్లి టౌన్o**



తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభు త్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ విషయంలో పెద్దపల్లి కి అన్యాయం జరిగిందని పెద్దపల్లి బిజెపి పట్టణ శాఖ మండల శాఖ ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తా వద్ద నిరసన తెలిపి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ తగలబెట్టారు. బిజెపి నాయ కులు మాట్లాడుతూ పెద్దపల్లి ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా వేచి చూస్తున్నా బస్సు డిపో తెలంగాణ బడ్జెట్లో ప్రస్తావన లేదు,వర్ష కాలం మొదలై సిజన ల్ వ్యాధులు విస్తురిస్తున్న, వాటి నివారణ అసలు ప్రస్తావన చేయలేదని విమర్శించారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారి మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఆరు గ్యారెంటీలు ,నిరుద్యోగ భృతి ,చేయుత పెన్షన్ల పెంపు ,బాలికలకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి ద్వారా తులం బంగారం ప్రస్తావన లేదని అన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు కావేటి రాజగో పాల్ మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ పోల్సాని సంపత్ రావు కౌన్సిలర్ మహంత ఎర్రోళ్ల శ్రీకాంత్ పట్టణ ప్రధాన కార్యదర్శి పెంజర్ల రాకేష్ వేల్పుల రమేష్ గుడ్ల సతీష్ పిట్ట వినయ్ ఉమేష్ కుక్క వంశీ గాధాసి సతీష్ శ్రీధర్ కుమార్ సోడాబాబు పోగుల రాజు ఉదయ్ వేణు మహేష్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎంపీఓగా ఫయాజ్

**సూర్య-పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి ఎంపివో సుదర్శన్ పాలకుర్తి మండలా నికి బదిలీ కాగా నూతన ఎంపివో గా ఫయాజ్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ ను కలిశారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ రామ్మోహన్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**సూర్య- కాల్వ శ్రీరాంపూర్**



మండల కేంద్రానికి చెందిన పాల మల ్లేశం ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలై లేవలేని స్థితిలో ఉన్నాడు. మల్లేశం వెన్నంపల్లి గ్రామంలోని ఉన్న త పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ గా పని చేస్తున్నాడు. శుక్రవారం మల్లేష్ ను పరామర్శించి ఎంఈఓ సురేందర్ రెండు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఎంఈఓ వెంట ఎం ఎన్ ఓ మహేష్, సిబ్బంది కారుకల స్వామి రమేష్ ఉన్నారు.

## అంగన్వాడి కేంద్రం సందర్శన

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని బొంపల్లి గ్రామపంచాయతీ పరిధి లోగల మేరపల్లి అంగ న్వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి, ఆర్డిఓ గంగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీల పౌష్టికాహార పంపిణీ పై పిల్లల బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు .అనంతరం ఆర్డీవో గ్రామంలోని అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్ ఎంపీ ఓ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

# గంజాయి కిట్ల ద్వారా అనుమానస్పద వ్యక్తులను చెక్ చేస్తాం

## -సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి

### - ఇల్లంతకుంటలో గంజాయి కేసులో ఒకరి అరెస్ట్.రిమాండ్ -100 గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం

**సూర్య, ఇల్లంతకుంట.**



గంజాయి సేవించిన,తరలించిన, విక్రయించిన వారి పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటూ, గంజాయి కిట్ల ద్వారా అనుమానస్పద వ్యక్తులను చెక్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్లో గంజాయి కేసులో ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన మొహమ్మద్ జమీర్ 22 అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు రూరల్ సిఐ మొగిలి,ఎస్.ఐ శ్రీకాంత్‌తో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా సి.ఐ మొగిలి మాట్లాడుతూ. ఇల్లంతకుంట గ్రామానికి చెందిన మొహమ్మద్ జమీర్ అనే వ్యక్తి ఇల్లంతకుంట లో ఆటో డ్రైవర్ గా పని చేస్తూ గంజాయి తాగడానికి అలవాటు పడి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం లో తెలియని వ్యక్తి వద్ద తాగడానికి ,అమ్మడానికి గంజాయి కొనుగోలు చేసి ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో అమ్మడానికి వస్తున్నారన్న సమాచారం మేరకు ఇల్లంతకుంటలోని జూనియర్ కళాశాల సమీపంలో శుక్రవారం నిందుతున్ని అదుపులోకి తీసుకొని, గంజాయి కిట్ ద్వారా చెక్ చెయ్యగా పాజిటివ్ గా రావడంతో నిందితుని వద్ద నుండి 100 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

## మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ గౌడ్

**సూర్య, బోయినపల్లి**



బోయినపల్లి మండల పంచాయతీ అధికారిగా శ్రీధర్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో బాధ్య తలు స్వీకరించే ముందు ఎంపీడీవో జయశీలకు పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో తో పాటు సీనియర్ అసిస్టెంట్ ఆరిఫ్, గౌతమ్ సిబ్బంది ఎంపీ ఓ కు శుభాకాంక్షలు తెలిపారు

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు ఎస్సై డి.సుధాకర్

**సూర్య, తంగళ్లపల్లి**



తంగళ్ళపల్లి మండలంలోని అంకుశ పూర్ గ్రామ శివారులో గల ఓర్రె నుండి వివిధ గ్రామాలకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు అని సమా చారం రావడంతో ఎస్సైడి. సుధాకర్, సిబ్బంది కిష్టయ్య,శ్రీనివాస్,సంపత్ తో కలిసివెళ్లి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ మీద కేసు నమోదు చేసి సీజ్ చేయడం జరిగింది అని తంగళ్లపల్లి ఎస్సై డి సుధాకర్ తెలిపారు.ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్,ఓనర్ అయిన అంకుసాపూర్ గ్రామానికి చెందిన గౌరవేణి.రాజు పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని,నిందితులు ఎంతవారలైన ఉపేక్షించబోమని ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణా సమాచారం సేకరించిన కానిస్టేబుల్ లను ఎస్సై అభినందించారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే డయల్ 100 ద్వారా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## మోడల్ స్కూలుకు వెళ్లే రహదారికి గ్రావెల్ మట్టి ద్వారా చదును

.. ఎంపీడీవో జయశీల..

**సూర్య, బోయినపల్లి**



బోయినపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ కి వెళ్లి రహదారి వర్షాలతో బురదమయం కావడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని సమస్య ను ప్రిన్సిపాల్ సుధాకర్ స్పెషల్ ఆఫీసర్ జయశీల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి గ్రావెల్ మట్టితో గుంతలు పూడ్చి ట్రాక్టర్ల ద్వారా చదును చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ రవీందర్ ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు . ఉన్నారు

## బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు ఘన సన్మానం

**సూర్య, గంభీరావుపేట**



గంభీరావుపేట మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా సమర్థవంతంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సుమల తను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్మాల గ్రామ మాజీ సర్పంచ్ ఎడ బోయినరాజు గంభీరావుపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఏగదండి స్వామి సిరిసిల్ల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోసల చంద్రం డిప్యూటీ తహసిల్దార్ అపర్ణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రవణ్ కుమార్ సత్యం సర్వేయర్ రామాంజనేయులు కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని పర్యవేక్షించిన కాయకల్ప వైద్య బృందం

**సూర్య, వేములవాడ**



ప్రాంతీయ దవాఖానను శుక్రవారం కాయకల్ప బృందం డాక్టర్ హరిప్రియ, డాక్టర్ సాయి కిరణ్, సురేష్ లు శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను, రికార్డులను తనిఖీ చేశారు.కాయకల్ప ఎక్స్టర్నల్ అసెస్మెంట్ లో భాగంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, వ్యర్థాల సేకరణ, విద్యుత్ వినియోగం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికి, ప్రాధాన్యత ఇలా దాదాపుగా 8 విభాగాల్లో పరిశీలించి దానికి సంబంధించిన రికార్డుల ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ సంతోష్ చారి డాక్టర్ తిరుపతి, సుభాషిని, రత్నమాల ఆఫీస్ సూపరిండెంట్ నాగరాజు , నర్సింగ్ సూపరిండెంట్ సంజీత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు

## విశాలాక్షి అమ్మవారు శాకాంబరి అవతారంలో దర్శనం

**సూర్య, సిరిసిల్ల టౌన్**

ఆషాఢ మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల శ్రీ విశ్వనాథుల దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్ లో గల శ్రీ విశ్వనాథ దేవాలయంలో విశాలాక్షి అమ్మవారిని శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పాలంకరణ తో కుంకుమ పూజలు,సామూహిక లలితా సహస్ర గావించారు.ఆషాఢ మాస పర్వదినాన్ని పురస్కరిం చుకొని వారం రోజులపాటు విశాలాక్షి అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ప్రతినిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కి సన్మానం

**సూర్య, ముస్తాబాద్**



గూడెం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సడిమెల బాలయ్య రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించడం జరిగింది.

## ఆపదలో అండగా సీఎం సహాయనిధి

**సూర్య, కోనరావుపేట**



ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, సీఎం సహాయ నిధి ద్వారా భరోసాను కల్పిస్తుందని కాంగ్రెస్ నాయకులు వీరవేని తిరుపతి యాదవ్ అన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తున్నదన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన కొత్తకొండ నర్సవ్వకు 15 వేలు, ఎం డి ఫిరోజ్ ఖాన్ కు 25 వేల విలువైన చెక్కులు సీఎం సహాయనిది నుండి మంజూరు కాగా శుక్రవారం లబ్దిదారులకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి , వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు గ్రామస్తులు లబ్దిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బొలగం కమలాకర్, నాయకులు వీరబోయిన తిరుపతి యాదవ్, మంత్రి మహేష్, తాళ్లపల్లి విజయ్ గౌడ్, బిట్ల అశోక్, వీరబోయిన ఎల్లయ్య, వీరబోయిన రాజయ్య వీరబోయిన వెంకటి తదితరులు పాల్గొన్నారు

## కేజీబీవీల్లో కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### -జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్

**సూర్య, రాజన్న సిరిసిల్ల.**

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన పని చేసేందుకు అర్హత , ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు స్థానికులు అయి ఉండాలని, (1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా స్థానికత నిర్ధారించబడును ) నని స్పష్టం చేశారు. 18 నుండి 45 ఏళ్ళ మధ్య వయస్సు కలిగి ఉండాలని, జిల్లాలో 2 అకౌంటెంట్, 1ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. కేజీబీవీ గంభీరావుపేట్, కేజీబీవీ కోనరావుపేట లో అకౌంటెంట్ అలాగే . కేజీబీవీ వేములవాడ అర్బన్ లో ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.అకౌంటెంట్ పోస్టుకు కామర్స్ డిగ్రీతో పాటు కంప్యూటర్ పై పరిజ్ఞానం కలిగి ఉండాలని, పోస్టు గ్రాడ్యుయేషన్ కామర్స్ అర్హత కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఏఎన్ఎం పోస్టుకు ఇంటర్మీడియట్ తో పాటు ఏఎన్ఎం ట్రైయినింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని,వృత్తి విద్యా కోర్సులో జీఏన్ఎం ట్రైయినింగ్ సర్టిఫికేట్ , బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికేట్ కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## బచ్చన్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణంలో ని బచ్చన్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో లో శుక్రవారం రోజున బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను రంగ వల్లులు, పూలతో అందంగా అలంకరించారు. విద్యార్థులు బోనం కుండలను ఇంటి వద్దనే అందంగా అలంకరించుకొని పాఠశాలకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బచ్చన్ అప్పర్ ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ నేదూరి అనిల్ కుమార్ పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పిల్లల్లో ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని పెంపొందించడానికి ఇలాంటి పండుగలు దోహదపడుతాయని తెలిపారు. పంచభూతాలను గ్రామదేవతలుగా భావించుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం వెనుక దాగి ఉన్న శాస్త్రీయ విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వీటీడీఏ పనుల్లో వేగం పెంచాలి

## -సమీక్ష సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సూర్య, వేములవాడ**



వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ(వీటీడీఏ) పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వీటీడీఏ పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీటీడీఏ పనులు ఎప్పుడు మొదలు పెట్టారు? ఎక్కడి వరకు పూర్తి అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుడి చెరువులో బండ్ అండ్ పార్క్ నిర్మాణ పనులను రూ. 12 కోట్లతో మొదలు పెట్టామని, వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. బండ్ పార్క్ పనుల్లో భాగంగా నటరాజ, సూర్య నమస్కారం విగ్రహాలు, అంఫీథియేటర్, ఇంటర్నల్ పాత్ వే, జోన్ వన్ ప్లాంటేషన్ పూర్తి కాగా, లాండ్ స్కేప్, గ్రానైట్ ఫ్లోరింగ్ తదితర పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. వీటీడీఏ పనుల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో దాదాపు ఎకరం విస్తీర్ణంలో రూ. 2 కోట్లతో మున్సిపల్ పార్క్ నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. వేములవాడ నియోజక వర్గంలోని తిప్పాపూర్, మారుపాకలో మోడల్ లేఅవుట్ పనులు తుది దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించి, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. శివార్చన స్టేజ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఇక్కడ వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, టూరిజం శాఖ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, ఎస్టేట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జన రంజక బడ్జెట్‌తో బీఆర్ఎస్ మైండ్ బ్లాంక్

## - ఉనికిని చాటుకునేందుకే ప్రాజెక్టుల బాట

## - కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జన రంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మైండ్ బ్లాంక్ అయిందని కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు విమర్శించారు. శుక్రవారం మీడియాకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క జన రంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టడంతో బీఆర్ఎస్ నాయకులకు నూకలు చెల్లాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఉనికిని చాటు కునేందుకే మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాజెక్టుల బాట పేరుతో కొత్తనాటకానికి తెర లేపారని మండిపడ్డారు.మీరు ఏ బాట పట్టినా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఎన్ని నాటకాలు వేసినా అన్ని విషయాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.తూతూ మంత్రంగా ప్రాజెక్టుల బాట పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజల్లో మరింత చులకన అవుతారని పేర్కొన్నారు.మొదట ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ ను చూసే కెసిఆర్ పాఠాలు నేర్చుకున్నారని పేర్కొన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఎల్ఎండి రిజర్వాయర్ ను నిర్మించిందని, అప్పుడు నీటిపారుదల శాఖ మంత్రిగా జీవి సుధాకర్ రావు పని చేశారని, వారి హయాంలో నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. లక్షలాది కోట్ల అవినీతికి పాల్పడి కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన పేరిట బీఆర్ఎస్ నాయకులు కొత్త డ్రామాలకు తెరలేపారని, ప్రజలంతా గమనిస్తున్నార ని తెలిపారు. ప్రజల చేతిలో చావు దెబ్బ తిన్నా, ఘోర పరాజయం పాలైన బీఆర్ఎస్ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి ప్రధాన ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ నాయకులకు నచ్చడం లేదని రాజేందర్ రావు మండిపడ్డారు. వారు ఎన్ని పన్నాగాలు పన్నినా ముఖ్యమంత్రి తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతారని వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# శుక్రవారం సభ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలి

## -అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ప్రఫుల్ దేశాయ్

**సూర్య తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో అంగన్వాడి సెంటర్లో పోషకాహారం, పిల్లల, తల్లుల సంక్షేమం గురించి ఏర్పాటుచేసిన శుక్రవారం శుభ కార్యక్రమానికి పోషణ అభియాన్ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ప్రఫుల్ దేశాయ్, మండల ప్రత్యేక అధికారి తిమ్మాపూర్ డిపిఓ కరీంనగర్ రవీందర్, ఎంపీడీవో విజయకుమార్, తహసిల్దార్ కనకయ్య హాజరైనారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న శుక్రవారం సభ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని తల్లులు గర్భిని లు మహిళలు ఏమైనా వారి యొక్క ఆరోగ్యపరంగా సమస్యలు ఏమైనా ఉంటే అంగన్వాడి అంగన్వాడి టీచర్ లను, మెడికల్ ఆఫీసర్ ఏఎన్ఎం లను ఆశాలను సంప్రదించాలని ప్రతి వారం జరిగే ప్రతి శుక్రవారంసభ కార్యక్రమాన్ని సద్వినియోగము చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం అమలు తీరును పరిశీలన చేసారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎంపీవో కిరణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ ప్రణవ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత, అంగన్వాడి టీచర్ apo రాజు, ఏఎన్ఎం, ఆశా, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది ,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఎద్దండి, గోదావరినది పరివాహక

# ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ప్రస్తుతం గత వారం రోజులుగా కూరుస్తున వర్షాలు దృష్ట్యా వాతావరణ శాఖ వారు మరో నాలుగు రోజులు వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రకటించినందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సూచించారు.వర్ష సూచన ఉన్న దృష్ట్యా వాగులు పొంగిపోర్లి చెరువులు కుంటలు నిండుకుండ లాగా ఉన్నాయిా కావున ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు వద్దకు పిల్లలు,యువత ఎవరూ చెరువుల వైపు వెళ్ళొద్దు అని అన్నారు. చెరువుల వద్ద వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. వర్షానికి ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మట్టి ఇండ్లు కూలిపోయే అవకాశం ఉంటుందని అందులో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం కు డయల్ 100 సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వర్షాల దృష్ట కరెంటు స్తంభాల దగ్గర కు ఎవరు వెళ్లకూడదని అన్నారు.

# గొర్రెను రక్షించబోయి బావిలో పడి మృతి

**సూర్య చిగురు మామిడి**



చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో మొగిలి బొందయ్య యాదవ్ వయసు (75 సం) గొర్లను మేపుకుంటూ వెళ్తున్న క్రమంలో వర్షంలో ఒక గొర్రె బావిలో జారి పడగా దానిని రక్షించేందుకు తాడు సహాయంతో బావిలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడగా బొందయ్యకు ఈత రానందున మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేష్ తెలిపారు.

# కంపు కొడుతోంది......

## - నర్మాలకు వెళ్లేదారిలో పేరుకుపోయిన చెత్త.

## - పందులు కుక్కలు, స్వైర విహారం..

## - పట్టించుకోని అధికారులు..

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండల కేంద్రంలోని నర్మాలకు వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి చెత్త నిల్వలు పేరుకుపోయి కంపుకొడుతుంది .పారిశుద్ధంపై ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో చెత్త కుప్పలు రోడ్డు వెంబడి తటంకమును తలపిస్తోంది. పందులు కుక్కలు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు ముక్కు మూసుకొని పోతున్నారు. వర్షాకాలం కావడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు దోమల వల్ల వ్యాధులు బారిన పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలను శుభ్రం చేయించి అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# తిమ్మాపూర్ సర్కిల్ ఆఫీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిపి

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, ఐపీఎస్ తనిఖీ చేసారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. విసిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టబడిన నూతన చట్టాల అమలు జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా సర్కిల్ పరిధి పోలీస్ స్టేషన్ లోని అధికారుల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలో ఎక్కువగా రాష్ట్ర రహదారి విస్తరించి ఉన్నందున తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హెూల్స్ గా గుర్తించి, అవసరమైతే ఇతరశాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాలు నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.అక్రమ ఇసుక రవాణా , పి.డి.ఎస్. బియ్యం , పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం,తగిన కేసులు నమోదు చేసి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గుడులల్లో చోరీకి తెగబడ్డ దొంగలు

**సూర్య మేడిపల్లి/ బీమారం**

మండలంలోని మన్నేగూడెం గ్రామంలోని రెండు పురాతన గుడులల్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మన్నేగూడెం గ్రామ శివారులోని శివాలయంలో,మల్లన్న స్వామి ఆలయంలో గురువారం రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఆలయాల్లోని నగదు ను చోరీ చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

